క్లుప్తంగా

బాధితులకు భరోసా కల్పించాలి



న్యాయసేవలపై సమీక్షిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ప్యానల్ లాయర్లు విచారణ జరిగే కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు భరోసాను ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు రత్నప్రసాదు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదుల ద్వారా వాదించే ఉచిత న్యాయ సేవలపై గురువారం సమీక్షించారు. అధికారులు సమన్వయంతో ఉచిత లీగల్ ఎయిడ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత సేవల పైన ప్రచారం చేయాలని అనానరు. జూలై 05న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సభ్యులు, ప్యానల్ లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (టూటౌన్) : జూలై 9న దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ప్రజలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవనంలో నిర్వహించిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ ఏలూరు జిల్లా నూతన నాయకత్వాన్ని ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షులుగా మడిమి కామయ్య, కొక్కిరపాటి ఆనంద్, సహాయ కార్యదర్శులుగా గోలిమే బాలయేసు, కూరాకుల బాబురావు, 19 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

మేతర సురేష్‌కు సన్మానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరానికి అంబికా దర్బార్ బత్తితో ప్రపంచ ఖ్యాతి తీసుకొచ్చిన అంబికా సంస్థల వ్యవస్థాపకులు దివంగత ఆలపాటి రామచంద్రరావు రూపాన్ని అగ్గిపుల్లపై ఆవిష్కరించిన చిత్రకారుడు మేతర సురేష్‌ను అంబికా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికా రాజా దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. రామచంద్రరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా రూపొందిచిన ఈ చిత్రాన్ని రాజాకు గురువారం సురేష్ అందజేశారు. కార్యక్రమంలో మున్నుల జాన్ గురునాథ్, అంబికా దర్బార్ బత్తి ఏలూరు డిస్ట్రిబ్యూటర్ పయిడేటి రఘు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సేవలకు చెల్లు

- వలంటీర్ల వ్యవస్థ రద్దు
- ఇంటింటికీ రేషన్ సరఫరా రద్దు
- రైతు భరోసాకు తిలోదకాలు
- కూటమి పాలనలో లబ్ధిదారులకు పాట్లు



తంగెళ్లమూడి పీహెచ్‌సీలో వైద్యం చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ (ఫైల్)



వాహనం వద్ద సరుకులు తీసున్న మహిళ (ఫైల్)

ఏలూరు (టూటౌన్): గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన గడప గడపకు పాలనకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. సుపరిపాలనకు తిలోదకాలు ఇచ్చి స్వపరిపాలనకు పెద్దపీట వేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం దళారీ వ్యవస్థ కట్టడికి వలంటీర్, సచివాలయం, ఎండీయూ (ఇంటింటికి రేషన్ సరఫరా), ఫ్యామిలీ డాక్టర్, రైతు భరోసా, రైతులకు గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేసింది. ఈ వ్యవస్థల రద్దు, నిర్వీర్యంతో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వృద్ధులు, వికలాంగులు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పథకాల కోసం ప్రజలు కాళ్లు అరిగేలా అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది.

తెల్లవారకముందే పింఛన్

వైఎస్సార్ సీపీ హయాంలో తెల్లవారక ముందే పింఛన్ సొమ్ము లబ్ధిదారుల ఇంటికెళ్లి వలంటీర్లు అందించే వారు. దూరప్రాంతాల్లో ఉన్న వారికి, ఆస్పత్రిలో వైద్య చికిత్సలు తీసుకుంటున్న వారికి వారి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందించేవారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో ప్రతి నెలా వివిధ రకాల పింఛన్లు 30,945 మందికి ఏటా రూ.76.27 కోట్లు అందించారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి 1,434 మంది వలంటీర్ల పొట్ట కొట్టింది. లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము కోసం మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారక ముందే అందించే పింఛన్ పొద్దు పోయాక కానీ అందించని పరిస్థితి నెలకొంది.

రేషన్‌కు ఇక ఇక్కట్లే!

ఎండీయూ (మొబైల్ డిస్పెన్స్ యూనిట్) వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులను అక్రమాలకు తావు లేకుండా అందించారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, ప్రజలకు ఎటువంటి కష్టం లేకుండా నేరుగా రేషన్ సరుకులను అందేవి. ఇంటి యజమాని అందుబాటులో లేకపోయినా ఇంటి వద్ద ఉండే పిల్లలు, మహిళలు నేరుగా రేషన్ వాహనం ద్వారా సరుకులను తీసుకునేవారు. ఏలూరు నగరంలో 30 వరకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందించేవారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, తిరిగి రేషన్ డీలర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టనుంది. డీలర్ల వద్దకు వెళ్లి క్యూలో నిల్చుని సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



ఏలూరు నగరంలో తెల్లవారుజామునే వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

నిలిచిన ఫ్యామిలీ డాక్టర్ సేవలు

వైఎస్సార్ సీపీ హయాంలో పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. పేదలకు అందించే వైద్యసేవలు నిలిచిపోయాయి. తిరిగి వైద్య సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు పేదలు క్యూ కట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

వెలవెలబోతున్న ఆర్‌బీకేలు



చొదిమెళ్లలోని ఆర్‌బీకే భవనం

గత ఐదేళ్లు రైతులకు పలురకాల సేవలు అందించిన రైతు భరోసా కేంద్రాలు నేడు వెలవెలబోతున్నాయి. రైతులకు విత్తనాలు, ఎరువులు, ఈ క్రాప్ నమోదు, ఎరువులు, ధాన్యం కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ఆర్థిక సాయం, బీమా వంటి పలు రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలు రైతులకు విశేష సేవలు అందించేవి. ఒక్కో ఏడాదికీ విలీన ఏడు పంచాయతీల్లో 1,122 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.13,500 చొప్పున మొత్తం రూ.1.52 కోట్లు క్రాప్ ఇన్సూరెన్స్ అందించారు. 1,320 మంది రైతులకు రూ.13,500 చొప్పున మొత్తం రూ.1.78 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించారు. నియోజకవర్గంలోని 9,031 మంది రైతులకు రూ.13,500 చొప్పున రైతు భరోసాలో ఆర్థిక సాయం రూ.12.19 కోట్లు అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ సేవలన్నీ రైతులకు అందని పరిస్థితి తీసుకొచ్చింది. దీంతో రైతుల్లో నిరాశ ఏర్పడింది.

పెట్టుబడి సాయం అందించాలి



ఎన్నికల హామీ మేరకు రైతులు, కౌలుదార్లకు పెట్టుబడి సాయం ఏటా రూ.20 వేలు అందించాలి. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంచాలి. రాజకీయాలకు తావు లేకుండా రైతుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– కె.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, రైతు సంఘం, ఏలూరు

రైతులను ఆదుకోవాలి



ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందించాలి. ఎరువులు, పురుగు మందులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలి. పూర్తిస్థాయిలో సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో ధాన్యం బకాయి సొమ్ము తక్షణం విడుదల చేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, వ్యవసాయకార్మిక సంఘం (బీకేఎంయూ), ఏలూరు జిల్లా

నాడు గడప దాటలేదు



వైఎస్సార్ సీపీ హయాంలో లబ్ధిదారులు గడప దాటాల్సిన అవసరం ఉండేది కాదు. నేడు కూటమి పాలనలో అధికారులు, కార్యాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గడప గడపకు పాలన పోయి కాళ్లు అరిగేలా తిరిగే పాలన తీసుకొచ్చారు.

– గారపాటి నాగేశ్వరరావు, దళిత నాయకుడు, ఏలూరు

ఆపరేటర్లకు ఉపాధి చూపాలి



జూన్ 1 నుంచి ఎండీయూ (రేషన్ సరఫరా చేసే వాహనాలు) రద్దు చేయడం ఆపరేటర్ల పొట్ట కొట్టడమే. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి. ఇంటింటికి రేషన్ అందించడంలో ఆపరేటర్లు తమ వంతు పని చేస్తున్నారు. ఇద్దరు రేషన్ డీలర్లు చేసే పనిని వెహికల్ ఆపరేటర్ హెల్పర్ సాయంతో చేసేవారు.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

పాలస్తీనా ముఖచిత్రం పుస్తకావిష్కరణ

ఏలూరు (టూటౌన్): స్థానిక స్ఫూర్తి భవన్‌లో రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) ప్రచురించిన పాలస్తీనా ముఖచిత్రం పుస్తకాన్ని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎంఎస్ నాగరాజు విడుదల చేసి, మొదటి పుస్తకాన్ని డాక్టర్ రావి గోపాలకృష్ణయ్యకు అందజేశారు. సభలో ముఖ్య వక్త, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి, ప్రపంచ న్యాయస్థానాలు, అరబ్ దేశాలు ఇజ్రాయేల్ దాడులను వ్యతిరేకించినా నేటికీ దురాక్రమణ దాడులు కొనసాగటానికి అమెరికా ప్రోద్బలమే ప్రధాన కారణమన్నారు. సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ నరమేధాన్ని అనేక దేశాలు ఖండిస్తున్నా, మన దేశ పాలకులు ఇజ్రాయిల్‌కు మద్దతునిస్తున్నారని ఆరోపించారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలస్తీనాకు అండగా ఉండాలని ఒక చారిత్రక నేపథ్యం కలిగిన పుస్తకాన్ని రూపొందించటం గొప్పవిషయమన్నారు. సభకు సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాషా అధ్యక్షత వహించారు. వివిధ గ్రామాలకు చెందిన రైతు కూలీలు, ఆదివాసీలు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న నాయకులు

చెరువుల అభివృద్ధికి నిధులు

కొయ్యలగూడెం: సాగునీటి చెరువుల అభివృద్ధికి, తూముల మరమ్మతులకు రూ.48 లక్షలు మంజూరయినట్టు పీడబ్ల్యూడీ అప్‌ల్యాండ్ సబ్ డివిజన్ బందకట్టు సెక్షన్ ఏఈ భాస్కర్ గురువారం తెలిపారు. పోలవరం కడెమ్మ కాలువ పనులకు రూ.5 లక్షలు, బుట్టాయిగూడెం మండలం జల్లేరు రిజర్వాయర్, అలివేరు ప్రాజెక్టులకు రూ.10 లక్షల చొప్పున, కొయ్యలగూడెం మండలం శ్రీరాములు కట్టు చెరువు అభివృద్ధికి, వేదాంతపురం ఎర్ర చెరువుకు రూ.3 లక్షలు చొప్పున, కన్నాపురం (కంద్రికగూడెం) సీతయ్య కట్టు చెరువుకు, దిప్పకాయలపాడు రాజు చెరువులకు రూ.4 లక్షలు చొప్పున, (కిచప్ప గూడెం) భీముడు చెరువు, జంగారెడ్డిగూడెం మండలం కృష్ణంపాలెం నందనాల ట్యాంక్, కొయ్యలగూడెం మండలం సరిపల్లి హుకుంపేట చెరువులకు రూ.3 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకునిపై అక్రమ కేసు కొట్టివేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైఎస్సార్ సీపీ నాయకునిపై ప్రత్యర్థులు పెట్టిన అక్రమ కేసును కోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. ఏలూరు మండలం పోణంగి గ్రామానికి చెందిన గేదెల సూర్యప్రకాష్ వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడిగా, ఏపీ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన పోణంగి కామాక్షి దేవి ఆలయ కమిటీలో కీలకంగా ఉన్నారు. అమ్మవారి ఆలయానికి ఆనుకుని ఘంటా రామకృష్ణ, కోట అరుణ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉంగుటూరు గ్రామం నుంచి వచ్చిన రామకృష్ణ భక్తులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించడాన్ని సూర్యప్రకాష్ ప్రశ్నించారు. వారి మధ్య జరిగిన వివాదంతో అరుణ మనస్తాపంతో 2023 ఫిబ్రవరి 4న పురుగుల మందు తాగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 6న మృతి చెందింది. ఈ కేసులో ఏలూరు రూరల్ పోలీసులు సూర్యప్రకాష్‌తో పాటు మద్రాపు ధనుంజయ, గేదెల నాగసత్యనారాయణ, బంకురు గంగాధరరావు అనే వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. 38 రోజుల తరువాత వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసులో ముద్దాయిలపై మోపిన నేరం రుజువు కానందున వారిని నిర్దోషులుగా విడుదల చేస్తున్నట్లు ఈ నెల 27న 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ తన తీర్పులో పేర్కొన్నారు. న్యాయం పక్షాన తీర్పు వెలువరించిందని, సూర్య ప్రకాష్ నిర్దోషిగా బయటపడడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి.



గేదెల సూర్యప్రకాష్

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	34	బీట్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	50
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	36
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	20
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	33
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

అయ్యో పాపం.. ఆవు



నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే పాత బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఒక ఆవును తాడుతో ఆటోకు కట్టి తీసుకెళుతున్న దృశ్యం కనిపించింది. ఆటోలో వెనుక వైపు దూడను పెట్టి, దాన్ని చూపిస్తూ తమ గమ్యస్థానానికి తీసుకెళుతున్నారు. ఇది సరికాదని స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

– సాక్షి ఫొటో గ్రాఫర్ /ఏలూరు

మద్దతు ధరపై రైతుల నిరాశ

ఏలూరు (టూటౌన్): కేంద్రం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రకటించిన మద్దతు ధర రైతులను మరోసారి నిరాశపరిచిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వరితో సహా 14 పంటలకు ప్రకటించిన మద్దతు ధర రైతాంగానికి ఆమోదయోగ్యంగా లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సి–2 ప్లస్ 50 శాతం ఆధారంగా మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో వరికి రూ.117 ప్రకటించారని, ప్రస్తుతం రూ.48 తక్కువగా కేటాయించి సాగుకు వ్యయానికి పొంతన లేని విధంగా మద్దతు ధర ప్రకటించి రైతులను మోదీ మరోసారి మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం విత్తనాలు, పురుగు మందుల ధరలు, డీజిల్ ధరలతో పాటు పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగిందని, ఆ స్థాయిలో మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసగిస్తున్నారని విమర్శించారు. రైతాంగానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఏలూరులో ప్రధానోపాధ్యాయులకు స్థాన చలనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. సత్రంపాడు హైస్కూల్‌కు ప్రసన్నాంజనేయులు, చాటపర్రు హైస్కూల్‌కు వి.మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఖండ్రికగూడెం పాఠశాలకు ఎస్ ఉమ, హనుమాన్ నగర్ పాఠశాలకు వి.సీతారామయ్య, పోణంగి పాఠశాలకు పీడీ విజయ కుమార్, గుడివాకలంక పాఠశాలకు బి.శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. సునీత ఏలూరు సుబ్బమ్మదేవి పాఠశాలకు, కస్తూరిబా బాలికోన్నత పాఠశాలకు సుబ్బమ్మదేవి స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ కె.మాధవీలత పదోన్నతిపై ప్రధానోపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. ఏఆర్‌డీజీకే పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ వీకే జయకుమార్ అదే పాఠశాలకు పదోన్నతిపై ప్రధానోపాధ్యాయునిగా నియమితులయ్యారు. ఏఆర్‌డీజీకే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఉజ్వల దక్షిణపు వీధి పాఠశాలకు బదిలీ అయ్యారు.

భూముల పరిశీలన

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపుకు గురవుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం, కూనవరం మండలాల పరిధిలోని నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం మండలంలో అనువైన భూములను పరిశీలిస్తున్నామని ఆర్‌డీఓ ఎంవీ రమణ, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళ వందనంలు తెలిపారు. బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం గ్రామంలో నిర్వాసితుల కోసం సేకరించిన భూములను పరిశీలించారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పునరావాస కాలనీల నిర్మాణానికి సుమారు 600 ఎకరాలకు పైగా భూములు అవసరం కాగా ప్రస్తుతం 300 ఎకరాల వరకు పరిశీలించామని తెలిపారు. నిర్వాసితులను ఆయా భూములకు తీసుకువచ్చి, వారి ఆమోదంతోనే వాటికి సేకరించామని వివరించారు.

సినిమా థియేటర్లతో తనిఖీలు

జంగారెడ్డిగూడెం: ప్రేక్షకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వినోదాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి థియేటర్ యాజమాన్యానికి ఉందని తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని థియేటర్‌లను ఆయన గురువారం తనిఖీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు మేరకు సినిమా థియేటర్‌లు తనిఖీ చేశామని తహసీల్దార్ తెలిపారు. వసతులు, టిక్కెట్ ధరలు, లైసెన్స్ తదితర విషయాలను పరిశీలించామన్నారు. కొన్ని థియేటర్‌లలో అగ్నిమాపక పరికరాలు లేవని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించామని తెలిపారు. క్యాంటీన్‌లో, టిక్కెట్ అధిక ధరలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. ప్రేక్షకునికి థియేటర్‌లోని సీటింగ్‌తో పాటు, టాయిలెట్ వంటి సౌకర్యలు సక్రమంగా ఉండాలన్నారు. షో ముగిసిన వెంటనే టాయిలెట్‌లను శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని ఆదేశించామని తెలిపారు. టిక్కెట్‌ల విక్రయాల్లో బ్లాక్ మార్కెటింగ్ లేకుండా కౌంటర్‌లో లేదా ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేపట్టాలన్నారు. ప్రేక్షకులు థియేటర్‌లో సమస్యలు ఉంటే తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో డీటీ రమేష్, వీఆర్‌ఓలు సురేష్, బాజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత సౌకర్యాలు కల్పించాలి



పెట్రోల్ బంక్ యాజమాన్యం, రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ స్లీవజోజి

జంగారెడ్డిగూడెం: వినియోగదారులకు నిర్దేశించిన సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన పెట్రోల్ బంక్ యాజమాన్యం, రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మండల పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్‌లలో పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్స్‌ను ఎప్పటికప్పటి శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి వాహనానికి ఉచితంగా గాలి పట్టాలని, తాగునీరు సదుపాయం కల్పించాలని ఆదేశించారు. పెట్రోల్, డిజిల్ ధరలు ఎప్పటికప్పుడు బోర్డు ద్వారా వినియోగదారులకు ప్రదర్శించాలన్నారు. పెట్రోల్, డిజిల్ నాణ్యతగా నిర్దేశించి ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. ప్రతి నెలా అధికారులు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేస్తారని తెలిపారు.

1 నుంచి చౌక డిపోల వద్దే రేషన్ పంపిణీ

ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించి పాత పద్ధతిలోనే జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు నిత్యావసరాలు అందించాలని తహసీల్దార్ రేషన్ డీలర్‌లను ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాప్ వద్ద సరుకులు పంపిణీ చేయాలన్నారు.